

# ఏడడుగులు ఎంత దూరము?

ఆరోజు అమావాస్య. రాత్రి పది దాటింది. తలుపు మీద టకటక.... టకటకటక. గదిలో ఒంటరిగా టెక్స్ట్ బుక్కు చదువుకుంటూ నిద్రలోకి జారుకోబోతున్న జానకికి ఆ టకటకలు గుండెల మీద కొట్టినట్టు వినబడుతున్నాయి. ఇంతరాత్రి.... ఒంటరి ఆడపిల్ల గది తలుపు కొడుతుందేవరో! ఎవరో రౌడీలు కావచ్చు ఈ రోజుల్లో పట్టపగలే చదువుకుంటున్న యువతుల మీద దాడులు పెరిగిపోతున్నాయి". ఎవరూ... ఎవరిది?" లేచి లైటు వేసింది. గుండె దిటవు చేసుకుంది. "న్నే.... నేనండి. మీ పక్కగదిలో ఉంటున్న బాంకు ఉద్యోగి శాంతారాంనండీ. తలుపు తియ్యండి. అర్జంట్ ప్లీజ్...".

ఆహాహ! ఏమి నటన! బాంకు ఉద్యోగి అయితే మాత్రం మగాడే గదా మృగాడు. "తియ్యను. తలుపు తియ్యను గాక తియ్యను. మర్యాదగా వెళ్లిపోండి. తల తిక్కవేశాలేస్తే తమాషా చూపిస్తాను.... జాగ్రత్త!". ఘాటుగా హెచ్చరించింది. అయినా లోలోపల పీచుపీచుమంటోంది. "అయ్యయ్యో! నాకో ప్రమాదం ముంచుకొచ్చిందండీ! ప్లీజ్.... నన్ను నమ్మండి...." శక్తినంతా కూడదీసుకుని దేవరించాను. అతని మాటల్లో నిజాయితీ గోచరించింది. ఎందుకైనా మంచిదని కొంగు నడుముకు బిగించి తలుపులు తెరిచింది. కళ్లు నులుముకుని చూసింది. నిజమే. పక్కగది శాంతారామే. మొహమ్మీద ఆందోళన.... కళ్లల్లో భయం. "ఏమైంది? ఏం ప్రమాదం ముంచుకొచ్చిందటా?" గర్జించింది. పళ్లు బిగపట్టి అతన్నే చూస్తోంది.

రపీన చెయ్యందుకుని తన గదిలోకి తీసుకెళ్లాడు. ఓక్షణం అయోమయంలో కూరుకుపోయిన జానకి వెంటనే సర్దుకుని "ఎందుకు? ఎందుకంటే?" మోచేతి మీద బొద్దింక పారుతున్నట్టు చెయ్యి ఝాడించి విడిపించుకుంది. చిందర వందర ముంగురులు

కపోలాలను తడుముతున్నాయి. "అదో.... అటు చూడండీ" మంచం చూపించాడు? అంటే అతని ఉద్దేశ్యమేమిటో? వీడు మృగాడే.... రోషం రుసరుసల్లో రాణి రుద్రమదేవిలా కన్పించింది. "చెప్పు తెగుద్ది..." పక్కనున్న అతని చెప్పు అందుకుని గాల్లోకి లేపింది. "తెగినా ఫరవాలేదు కానీ ఆ తేలు సంగతి చూడండి. ప్లీజ్... నాకు తేలును చూస్తే బండెడు భయం". వణికి పోతున్నాడు. మంచమ్మీద పిడికెడంత తేలు.... ఎఱ్ఱతేలు.... తెల్లని బెడ్‌షీట్ మీద వయ్యారంగా దిండుమీది కెక్కబోతుంది. ట్యూబులైటు వెలుతురులో తళతళా మెరుస్తోంది. అదే చెప్పుతో తేలును ఫటాఫటా.... నాలుగంటించింది. తేలు చచ్చిపడుంది. చేత్తో ఎత్తి కిటికీలోంచి బయటికి విసిరేసింది.

ఇద్దరూ కోరస్‌గా గుండెనిండా ఊపిరి పీల్చుకున్నారు. ఒకే ఇంట్లో పక్క అద్దె గదుల్లో ఉంటున్నారు. "మీరింత పిరికి వారనుకోలేదండీ!" కిలకిలా నవ్వింది. ఆ నవ్వులో నయాగరా జలపాతం సవ్వడి వినిపించింది. "ఇది విషప్పురుగండీ... మీకు భయమన్పించలేదా? నేను గూడా.... భయపడను కానీ... రాత్రి సమయం కదా!" తనను తాను సమర్థించుకోబోయాడు. "నేనా! నేను పులిని చూసినా భయపడను. ఆఫ్టరాల్ ఈ తేలు, ఎలుకకు భయపడ్తానా?" ఇహ పడుకోండి.... అయితే మీరు భయపడరన్న మాటా!" కనుబొమ్మలు పైకి ఎగరేసి పకపకా నవ్వుతూంటే బుగ్గమీద తేనె రంగు పుట్టుమచ్చ తళుక్కుమంది. బాంకు ఉద్యోగంలో కొత్తగా చేరాడు శాంతారాం. చదువులవేటలో బి.కాం. ఫైనలియర్లో వుంది జానకి. హాస్టల్లో సీటు దొరక్క ఆమె, బ్రహ్మచారి ఉద్యోగి అతడు.... కొత్తగా నిర్మించిన బిల్డింగు అద్దె గదుల్లో చేరి వారమైంది.

రోజూ ఉదయమే "కౌసల్యా సుప్రజారామా...." క్యాసెట్టు వెయ్యడం శాంతారాం కలవాటు. అది కర్ణపేయంగా వినబడి నిద్రలేవడం జానకి కలవాటైంది. తేలు సంఘటనతో మనుషులకు పరిమితమైన పరిచయ పారిజాతము పది నెలల్లో పలు దళాలుగా వికసించి మనసులను కదిలించింది. సాన్నిహిత్యం బలపడి సినిమాలు, షికార్లు తిరిగేందుకుత్సాహ మిచ్చింది. రాను రాను సంబోధన ఏకవచనంగా పరిణతి చెందింది. ఆమె నవ్వితే అతనికి వెండికొండ మీద వెన్నెల తుళ్లి పడ్డటనిపిస్తుంది. అతని ప్రవర్తనలో ఆరబోసిన అమాయకత్వం, కంప్యూటర్‌ను మించిన తెలివితేటలున్నాయని కనిపెట్టిందామే.

బి.కాం. ఫైనల్ పరీక్షలైపోయినై. గది ఖాళీ చేసి వెళ్లే ముందు శాంతారాం గదిలోకి ఉడుత పిల్లలా పరుగెత్తుకొచ్చింది జానకి. మొగ్గలాగున్న ముసిముసి నవ్వు, జాజి పూవులా విచ్చుకుంది. ఆత్మబంధువు అమెరికాలో సెటిలయేందుకు వెళ్తుంటే వీడ్కోలు పలుకుతున్నట్టుగా వుందతనికి. రెండు నిమిషాలు మౌనంగా గడిచాయి. "మనం మళ్లీ ఎప్పుడు కలుసుకుంటామో!" అదే క్షణంలో ఆమె నల్లని కలువ కళ్లను తెల్లని నీటిపొర కమ్ముకుంది. అతని చెయ్యందుకుని కళ్లకద్దుకుంది. "ఎందుకు కలుసుకోము?" అతని

గుండె కనుమల్లో పుట్టిన ఉద్వేగపు జాలు గొంతులోకి జారింది. "నీ పెళ్లికి నేను, నా పెళ్లికి నీవు... మరిచిపోతామా?" బలవంతంగా నవ్వాలని ప్రయత్నించినా సాధ్య పడలేదు. "మీ ఊరు, మా అమ్మమ్మ ఊరు ఒకటేగదా! నేను తప్పకుండా వచ్చి కలుస్తా. ప్రస్తుతం మా ఊరికెళ్తున్నాను. అర్జంటుగా రమ్మని మా నాన్న ఫోన్ చేశాడు". "అర్జంటు... అంటే... పెళ్లి సంబంధమేమో!". అవును జానకీ! మా చెల్లి పెళ్లి...!" ఇద్దరూ నవ్వుకున్నారు. హుషారుగా గదిలోకి పరుగెత్తుకొచ్చిందల్లా సీస పెంకుల మీద నడుస్తున్నట్టు అడుగులో అడుగేసుకుంటూ కదిలి పోయింది.

+

"నాన్నా! ఈ ఉగాది పండక్కి నేను అమ్మమ్మ వాళ్లింటికెళ్తున్నా. మనూరికి రాను". సెల్‌ఫోన్‌లో డిక్లేర్ చేశాడు శాంతారాం. సుమారు పదినెలల క్రితం విడిపోయిన జానకి మనసు తెరమీద వయ్యారంగా కదిలింది. వాళ్ల నాన్న ఊరుకుంటాడా?. "అంత పెద్ద పండక్కి అమ్మమ్మ ఇంటికెందుకురా? మనూరికే రా. చెల్లి పెళ్లయింది గదా! నీగ్గుడా పెళ్లి సంబంధాలొస్తున్నాయి. పనిలో పనిగా వారం రోజులు సెలవు పెట్టేసి వచ్చేయ్. ఏదో ఓ సంబందం ఖాయం చేసుకుందాం!". "నాన్న! మీరట్లా తొందరపెడితే నేనసలు పెళ్లే చేసుకోను. నాకు నచ్చిన అమ్మాయిని నేనే సెలెక్టు చేసుకుంటా"."సరే... మీ అమ్మతో మాట్లాడు". "సరే నాన్నా!". "ఒరేయ్ వెర్రి నాగన్నా! నీ పెళ్లి కళ్లారా చూడాలని ఉందట్రా మీ నానమ్మకు. నీ ఇష్టమొచ్చిన అమ్మాయితోనే పెళ్లి జరిపిస్తాం కానీ.... సాధ్యమైనంత త్వరలో....". "సర్సరే. ప్రస్తుతం ఉగాది పండక్కి అమ్మమ్మ ఊరికెళ్తున్నాను. ఆ తర్వాత మిగతా సంగతులు". "అమ్మమ్మ ఇంటికెందుకురా? మా తమ్ముడు నీ కంటే ఐదేళ్ళే పెద్దగదా! వానికి పెళ్లికెదిగిన కూతురు గూడా లేదాయే". "అయినా సరే. అటే వెళ్తున్నాను. మీ అమ్మ ఇంటికి వెళ్తానంటే అలాగంటా వేందీ?". "సరేరా.... నీ యిష్టం". అంతకు ముందే జానకి నుండి వచ్చిన ఉత్తరాన్ని పాంటు జేబులో తడిమి చూసుకున్నాడు. క్షేమంగా వుంది.

"జానకీ! నీకివాళ్ల పెళ్లి చూపులమ్మా. వరంగల్ నుండి పెళ్లి వారొస్తున్నారు. పిల్లగాడు హైద్రాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరటా". నాన్న ఉత్సాహంగా అంటున్న మాటలేవీ జానక్కి మింగుడు పడ్డం లేదు. మొహం ముడుచుకుంది. "ఎందుకు నాన్నా పెళ్లి చూపులపేర గంగిరెద్దులా తయారై కూచోడం? అదేదో పెద్ద ఇంటర్వ్యూలాగా వాళ్లేదో అడగడం, మనం సమాధానాలు చెప్పడం నాకు నచ్చలేదు నాన్నా! ప్రతివాడూ కట్నానికాశ పడేవాడే. అలాంటి మొగుడు నాకొద్దు". వినరాని మాటలేవో విన్నట్టుగా అమ్మా, నాన్నలు మొహాలు చూసుకుని

వీపు నిమిరింది. "మన కులంల నీలెక్క చదువుకున్న పిల్లకు తగిన పిల్లోడు దొరకడమే కష్టం. నాన్న ఎక్కడెక్కడో తిరిగి, ఎవరెవర్నో అడిగి మంచి సంబంధం చూస్తున్నాడు. మా మాట విని తయారుగా వుండు"."చూడు తల్లీ! నీకు మంచి సంబంధాలే చూస్తున్నా. నువ్వే ఏదో వంకతో తిరగ్గొడ్తున్నావు". తండ్రి ఆవేదన... "ఇప్పటికే ఐదారు పెళ్లి చూపులకు కూచున్నా. ఇంకా తయారై కూచునే ఓపిక లేదు నాన్నా! నాకు నచ్చిన అబ్బాయిని నేనే వెతుక్కుంటా". కరాఖండిగా చెప్పేసింది.

+

చాలా రోజుల తర్వాత బస్సులో అమ్మమ్మ ఊరెళ్తాంటే శాంతారాంకు విమానంలో ఢిల్లీకి వెళ్తున్నంత థ్రిల్లింగా వుంది. బస్సు ముందుకు పరుగెడుతూంటే రోడ్డు పక్కన కాపలా సైనికుల్లా నుంచున్న చెట్లు తలలూపుతూ స్వాగతం పలుకుతున్నాయి. కొత్త చిగురులు తొడుక్కున్న తరుతరుణులు మోడు వారిన గతాన్ని మరిచి కొమ్మలు రెమ్మలతో గాలి తరగలను ముద్దాడుతున్నాయి. వాటి కదలికల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయి. ఆకాశమైదానములో దూది పింజలు రాశులు పోసినట్టు మబ్బులు తిరగాడుతున్నాయి. బస్సుదిగి ఎయిర్ బ్యాగు చంకకు తగిలించుకుని ఒళ్లు విరుచుకున్నాడు. మామిడి తోటలోంచి ఊళ్లోకెల్తున్నాడు. మామిడి పూత కమ్మని వానన. కోయిల పాటకు తుమ్మెదల ఝుంకారాసు రాగాలందిస్తున్నాయి. కొమ్మల సందుల్లోంచి చొచ్చుకొచ్చిన సూర్య కిరణాలు ఫొటోఫ్లాష్‌లా వెలిగిపోతున్నాయి. విరగకాసిన పిందెలతో మావిగున్నలు పీతాంబరాలు ధరించిన నిండు ముత్తైదువుల్లాగున్నాయి. మామిడి తోట మధ్యన మోదుగు చెట్లు పెద్ద పెద్ద ఆకులనాడిస్తూ పండగ భోజనానికి మమ్ముల్ని తీసుకెళ్లండని పిలుస్తున్నాయి. ఇంటి అరుగు మీద అమ్మమ్మ కూచునుంది. దగ్గరికెళ్లి "అమ్మమ్మా! బాగున్నావా?" అంటూ పక్కన కూచున్నాడు.

కళ్లమీది సూర్య కిరణాలకు అరచేతులడ్డం పెట్టుకుని కింది నుంచి మీద్దాకా చూసింది. ముడతల మొహం ముద్దబంతి పూవులా విచ్చుకుంది. "శాంతా! నా బంగారు కొండా!" అమ్మమ్మ అక్కున చేర్చుకుంది. నీకు బాంకులో మంచి నౌకరి దొరికిందట కదరా! మీ తాతయ్యలాగ నువ్వు గూడా అదృష్టవంతుడివిరా!" నుదురు ముద్దాడింది. "అవునే. ఆ సంగతి నీకు చెప్పాలనే పండక్కి ఇక్కడిచ్చాను. తృప్తిగా ఉందా?". "మా నాయనే. నీయన్నీ మీ తాతయ్య బుద్ధులేరా! ఆయన ఏ లోకంలో ఉన్నాడో గానీ..." తాత పురాణం విప్పబోయింది. "నాకన్నీ తెలుసునే అమ్మమ్మా!" అరుగు దిగాడు. అమ్మమ్మ తాతయ్య కథలు చెప్పడం ప్రారంభిస్తే కామా, ఫుల్‌స్టాపులుండవు. "మావయ్యున్నాడా?" అంటూ లోపలికెళ్లాడు.

"వారెవ్వా! వ్వాటే వండర్?" మావయ్య ఎదురొచ్చాడు. "ఏరా! ఇవ్వాళ్ల సూర్యుడు తూర్పున్నే ఉదయించాడా! ఎన్నిసార్లు రమ్మని ఫోన్ చేసినా రానివాడివి ఫోన్ కూడా చేయ్యకుండా ఉడిపడ్డావు". కరచాలనం చేశాడు. ఒకరినొకరు గుండెలకు హత్తుకున్నారు. లోపలి నుండి కాలి మువ్వల సవ్వడి కర్ణపేయంగా వినబడింది. అత్తయ్య వచ్చింది. అయితే ఇది కాలిపట్టాల మువ్వల సవ్వడన్నమాట. "బాగున్నారా అత్తయ్యా". "ఆ ఆ.... బేంకు ఉద్యోగంలో చేరాక మేము గుర్తున్నామా మహారాజు!" ఎర్రని పెదాల మీద వెలుగు కిరణాలు పడి పరావర్తనం చెందాయి. "మరిచిపోవడం కాదత్తయ్యా! బేంకు ఉద్యోగం గదా! సెలవులు దొరకడం కష్టం. అయినా... పండక్కి కొత్త అల్లుడిలా రేపు ఉగాది పండగైతే ఈ రోజే వచ్చానుగదా!. ఈ పండగను మీ మధ్య జరుపుకోవాలన్పించింది".

"తొందరగా పెళ్ళి చేసుకుని పప్పన్నం పెట్టించురా! నోరు తీపి చేస్తే మన బ్రాహ్మణులకు కొండంత పండగ్గదా!" అంటూ మావయ్య లోపలికి తీసుకెళ్లి కూచోబెట్టాడు. తాను ఎదురుగా కూచున్నాడు. అమ్మమ్మ మనవని పక్కన కూచుంది. అత్తయ్య గరంచాయలతో వచ్చి తలా ఓ కప్పు అందించింది. తానూ ఓ కప్పుతో భర్త పక్కన కూచుంది. అంతా గరంచాయ సేవిస్తున్నారు. చాయ్ ప్రతాపం ఉత్సాహంగా మారింది. "అవును గాని మావయ్యా! ఈ ఊళ్లో జానకి అనే అమ్మాయి...బి.కాం. చదివిన అమ్మాయుంది గదూ!". అత్తయ్య కనుబొమలు అసంకల్పితంగా మండిపడ్డాయి. "ఎందుకురా?" అమ్మమ్మ బుగ్గలు నొక్కుకుంది. "ఉందిరా! వాళ్లు గంగాపుత్రులురా! చేపలు పట్టి అమ్మడం వాళ్ల వృత్తి". "కావచ్చు. ఆమె కరీంనగర్లో బికాం చదివేటప్పుడు మారూం పక్క రూములో ఉండేది. అట్లా పరిచయం". నవ్వబోయి నోర్మునుకున్నాడు. "పాపం! ఆ పిల్లకు పెళ్లి చూపులవుతున్నాయి గాని ఏ అబ్బాయినీ నచ్చడం లేదటా!" అత్తయ్య అంది. "ఎవరినన్నా ప్రేమించిందేమో!" మావయ్య సూటిగా చూశాడు. "ప్రేమ గుడ్డిదంటారు గదా! ఆమె ప్రేమలో చిక్కుకున్నోడిదేం కులమో!". "ప్రేమకు కులం అడ్డమా మావయ్యా?". "ప్రేమకేమో కాని పెళ్లికి అడ్డమే గదరా!".

"అదంతా ట్రాష్ మావయ్యా! పూర్వకాలంలోనే కులాలపట్టింపు లేదు. ఇవన్నీ మధ్యన వచ్చినై". "ఏమన్నావురా శాంతా?" అమ్మమ్మ మూతులు తిప్పింది. "బ్రాహ్మణ కులస్తులము. మనమట్లా మాట్లాడొచ్చా? కులము - స్థలము, ఆస్తి - అంతస్తులు అన్నీ కలిసిన తర్వాతనే గదా పెళ్లి ఖాయమయేది!". "ఈ కులాలు గిలాలు నడుమంత్రాన వచ్చినవే అమ్మమ్మా!" భారతంలో శంతనుడు క్షత్రియుడు. అతడు బెస్తయువతి సత్యవతిని పెళ్లాడలేదా?". "అయితే కావచ్చు. అదొక్కటే ఆధారంగా తీసుకుని కులంకానోళ్లను పెళ్లాడ్తే బావుంటుందా?". ఖాళీ చాయకప్పును లకీన టాపాయ్ కప్పగించింది.

అత్తయ్య - మావయ్యలు విస్తుబోయి మొహాలు చూసుకుంటున్నారు. "అదొక్కటే

కాదే అమ్మమ్మా! ఇంకా చాలా ఉన్నాయే!". "నీ మొహం! ఏదీ.... ఇంకొకటి చెప్పు చూద్దాం!". "వశిష్ఠ మహర్షి బ్రాహ్మణుడు. దళిత యువతి అరుంధతిని పెళ్లాడాడు గదా! వాళ్లది ఆదర్శ దాంపత్యం గదా! పెళ్లిలో నూతన దంపతులకు అరుంధతి నక్షత్రాన్ని చూపిస్తారందుకే గదా!". "అయితే కావచ్చు బాబూ! కాని కులం పట్టింపుల్ని మార్చడం మన తరమా?" అత్తమ్మ బిత్తరపోయింది. నుదుటి బొట్టు సూర్య బింబములా ఉదాత్తంగా మెరిసింది. "అనుకుంటే మార్చవచ్చు అత్తయ్యా! శ్రీకృష్ణుడు యాదవుడు. అతని అష్ట భార్యలంతా యాదవులేనా?". మావయ్య మొహంలో ఉలికిపాటు. "కాదుగానీ నీ ఉద్దేశ్యమేమిట్రా?" సూటిగా అడిగాడు. "ఇదిగో ఈ ఉత్తరం గట్టిగా చదువు మావయ్యా! అందరికీ వినబడేలా చదువులో పాంటు జేబులోంచి ఉత్తరం తీసి చేతికిచ్చాడు. అత్తయ్య ముందుకు వంగింది". "త్వరగా చదవండి. రేపే పండగ. ఏర్పాట్లు చేసుకోవాలి బోలెడు పనుంది". "సరే వినండి". ఉత్తరం విప్పాడు మావయ్య.

"శాంతారాంకు – నమస్కారాలు.

మనం కరీంనగర్లో గడిపిన రోజుల్లోని తీపిజ్ఞాపకాలను నెమరేసుకుంటూ క్షేమంగా ఉన్నాను. ఆ జ్ఞాపకాలను రేపటి వ్యాపకాలతో ముడేస్తున్నాను. నువు క్షేమం గదూ! మనము కలిసి తిరిగాము. భీష్మ సినిమా కలిసి చూశాము. అందులో... సత్యవతి – శంతనుల పెళ్లిని నువు మెచ్చుకున్నావు. అలాంటి పెళ్లిళ్లు ఈ రోజుల్లో జరిగి తీరాలన్నావు. అది నా గుండెల్లో గూడు కట్టుకుంది. ఆనాటి నుండి నేటివరకు మనసు పొరల్లో పేరుకుపోయిన స్తబ్దతని, సుషుప్తిలోకి జారిన ఆత్మని ఎవరో పూలబాణం ఎక్కుపెట్టి కొట్టినట్టు, అది పొరల్ని చీల్చుకుని వెళ్లి నిద్రావస్థలో ఉన్న ఆనాటి అనుభవాలను తట్టి లేపినట్టు ఆలోచనలు అలలు అలలుగా ఎగదన్నుకొస్తున్నాయి.

మనిద్దరం మనుషులుగా కలిసి తిరుగుతూ మనసులిచ్చి పుచ్చుకున్నామని ఆలస్యంగా అర్థమైంది. చదువుకుని ఉద్యోగస్థుడివైన నీకు కులం పట్టింపు లుండవనుకుంటున్నాను. నాకు మా అమ్మా నాన్నలు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. పెళ్లి చూపులవుతున్నాయి. కావాలనే ఏదో వంకతో నేనే అతక్కుండా చేస్తున్నాను. నిజంగా నువు నన్ను ప్రేమించినట్లైతే మీ అమ్మా నాన్నల్ని ఒప్పించి వచ్చే ఉగాది పండగనాడు మా ఇంటికిరా. అలా వస్తే మన ప్రేమ మూడు ముళ్లు ఏడడుగులుదాకా వెళ్తుంది. నా పెళ్లి విషయంలో మా అమ్మానాన్నలు నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. నిన్ను చూడగానే నా కళ్లల్లో మెరుపుతీగ తళుక్కుమంటుంది. నువు రాకపోతే జీవచ్ఛవమై అమ్మానాన్నల నిర్ణయానికి తలవంచక తప్పదు. ఉగాది పండగ నాడు.... నవవసంతం నీ రూపంలో వస్తుందని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటాను.